E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 05-05-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

సీబీఎస్ఈ ఫలితాల వదంతులు.. బోర్డ్ క్లారిటీ » 2లో

## మూసీని మూసేస్తుంటే.. కళ్లు మూసుకున్నారు



**ఇది మూసీ నది. రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, మంచిరేవుల గ్రామం పరిధిలో నార్సింగి బాహ్యవలయ రహదారి ఎగ్జిట్ 18ఏ పక్కనే ఉంది.**

**యథేచ్ఛగా ఉల్లంఘనలు.. షరతులు హుష్‌కాకి...**

**నది ఒడ్డునే 38 అంతస్తుల భారీ నిర్మాణం**

ఇది మూసీ నది. రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, మంచిరేవుల గ్రామం పరిధిలో నార్సింగి బాహ్యవలయ రహదారి ఎగ్జిట్ 18ఏ పక్కనే ఉంది. ఇక్కడ ఓ సంస్థ భారీ నిర్మాణం చేపట్టింది. నిర్మాణ వ్యర్థాలను, ఇతర సామగ్రిని మూసీ నదిలో నింపేసింది. నదిలో ఫెన్సింగ్(ఇనుప కంచె) ఏర్పాటు చేసింది. ఇంత జరుగుతున్నా.. అధికారులెవరూ అటు కన్నెత్తి చూడలేదు.

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళనకు ప్రత్యేకంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను 2017లో ఏర్పాటు చేసింది. నది బఫర్ జోన్ పరిధిలో 50 మీటర్ల వరకు, ఆ తర్వాత 100 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలకు అనుమతించకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే నిర్మించిన దాదాపు 15వేల కట్టడాలను తొలగించాలనే ప్రతిపాదన ఉంది. కొత్తగా అనుమతులు ఇవ్వకూడదు. కానీ ఈ భవంతి నిర్మిస్తున్న పరిస్థితుల్లో మూసీ ప్రక్షాళన సాధ్యమవుతుందా అనే ప్రశ్న వ్యక్తమవుతోంది. అనుమతుల జారీలో హెచ్ఎండీఏలో భారీగా సొమ్ములు చేతులు మారి ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ అడిగితే న్యాయస్థానం ఆదేశాల ప్రకారం నిర్మాణం కొనసాగిస్తున్నారని చెబుతున్నారే తప్ప.. షరతులు పాటించని విషయంపై మాట్లాడడం లేదు.

తరువాయి 2లో



## ప్రధాని మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ కీలక భేటీ. ఏం జరగనుంది?


తరువాయి 2లో



ఈ కబురు,ఢిల్లీ: భారత్, పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ.. జాతీయ భద్రతా సలహాదారు, ఎయిర్‌చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో తాజాగా సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఇక, సరిహద్దుల్లో ఉద్రిక్తత కారణంగా ప్రధాని మోదీ.. వరస భేటీలు అవుతున్నారు. ఇప్పటికే త్రివిధ దళాల అధికారులతో భేటీ అయ్యారు.

## పాక్‌కు భారత్ మరో షాక్......

### ఆ రెండు నదుల నీటి సరఫరా బంద్!



**ఈ కబురు: జమ్మూ కశ్మీర్‌లోని పహెల్గాం లో ఉగ్రదాడి అనంతరం భారత్ పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఉగ్ర దాడిని సీరియస్ గా పరిగణించిన భారత్ దాడికి వ్యతిరేకంగా తీవ్ర చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దాయాదిని దెబ్బ మీద దెబ్బ కొడుతూ తగిన గుణపాఠం చెప్పడానికి ప్రయత్నిస్తోంది. ఇప్పటికే పాకిస్తాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన ఇండియా తాజాగా చీనాబ్ నది నీటి ప్రవాహాన్ని సైతం ఆపేసింది.**

తరువాయి 2లో



## దక్షిణ తెలంగాణకు గత ప్రభుత్వం అన్యాయం చేసింది: మంత్రి ఉత్తమ్ » 2లో

**ఏదో విధంగా ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, ఆగిపోయిన కందమల్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.**

ఈ కబురు,మిర్యాలగూడ: ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని, ఆగిపోయిన కందమల్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

**తెలంగాణలో చేసిన బీసీ గణనను కేంద్రం అవలంబిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బీసీ చట్టం చేసింది కాంగ్రెస్ పార్టీనే, జనాభాకు అనుగుణంగా బీసీలకు న్యాయం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.**

ఈ కబురు,సూర్యాపేట : వడ్డెర కులస్తులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. వడ్డెర కులస్తులకు తమ ప్రభుత్వంలో పెద్దపీట వేయబోతున్నామని అన్నారు.

» 2లో

## పాక్ కోసం 'ఇగ్లా'లు సిద్ధం చేసిన భారత్..! 2లో



## కోహినూర్ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇచ్చేస్తారా..? బ్రిటన్ మంత్రి ఏమన్నారంటే?

**బ్రిటన్ మహారాణి కిరిటంలో పొదివి ఉన్న కోహినూర్ వజ్రం విశిష్టత గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. దానిని తిరిగి భారత్‌కు ఇచ్చేస్తారా? అన్న ప్రశ్నకు బ్రిటన్ సాంస్కృతిక, మీడియా, క్రీడల శాఖ మంత్రి లీసా నాండీ బదులిచ్చారు.**

» 2లో


ఈ కబురు,ఢిల్లీ: బ్రిటన్ మహారాణి కిరిటంలో పొదివి ఉన్న కోహినూర్ వజ్రం విశిష్టత గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. దానిని తిరిగి భారత్‌కు ఇచ్చేస్తారా? అన్న ప్రశ్నకు బ్రిటన్ సాంస్కృతిక, మీడియా, క్రీడల శాఖ మంత్రి లీసా నాండీ బదులిచ్చారు. భారత్, బ్రిటన్ మధ్య సాంస్కృతిక కళాఖండాల మార్పిడి కోసం ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నట్లు చెప్పారు. ......

## రాముడిపై రాహుల్ వ్యాఖ్యలు.. భగ్గుమన్న బీజేపీ నేతలు » 2లో



**ఈ కబురు: కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ "శ్రీరాముడి"పై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలోని వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో జరిగిన డిబేట్ లో రాహుల్ మాట్లాడుతూ.. " రాముడు పురాణాలకు చెందిన వ్యక్తి"గా అభివర్ణించారు. హిందూ జాతీయవాదం ఆధిపత్యం చెలాయించే యుగంలో అన్ని వర్గాలను స్వీకరించే లౌకిక రాజకీయాలు ఎలా రూపొందించాలి..?**

## 'అది నా బాధ్యత.. మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుంది' రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు » 2లో



**భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు.**

ఈ కబురు,దిల్లీ: భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం రక్షణ మంత్రిగా తన బాధ్యత అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పని తీరు, పట్టుదల గురించి అందరికీ తెలుసన్న రాజ్‌నాథ్.. ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరిగి తీరుతుందని తాను హామీ ఇస్తున్నానన్నారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు, పాక్‌పై ప్రతీకార చర్యలను కేంద్రం పరిశీలిస్తున్న వేళ రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. దిల్లీలో జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

» 2లో

## మావోయిస్టులతో మాటల్లేవ్..... మాట్లాడుకోడాల్లేవ్.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



## భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత.. కరాచీ తీరానికి తుర్కియే యుద్ధనౌక » 3లో



## ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం: హరీశ్‌రావు » 2లో

**విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.**

ఈ కబురు,హైదరాబాద్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు



లఖ్‌నవూ హ్యాట్రిక్ ఓటమి.. పంజాబ్‌కు ఏడో విజయం » 6లో



రియాన్ పరాగ్ పోరాటం వృథా.. ఒక్క పరుగు తేడాతో కోల్‌కతా విజయం » 6లో



హీరోయిన్ వెయిట్ లాస్ జర్నీ.. వీడియో వైరల్ » 5లో



ఐదు బ్యాంకులపై ఆర్‌బీఐ కొరడా.. భారీ జరిమానా » 4లో



మొదటి పేజీ తరువాయి

# మూసీని మూసేస్తుంటే.. కళ్లు మూసుకున్నారు



సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తర్వాత అధికారుల నుంచి నివేదికను, సంస్థ నుంచి ఓ ప్రమాణ పత్రం తీసుకున్న న్యాయస్థానం ఆ మేరకు పిటిషన్‌ను మూసివేసింది. సంస్థ మళ్లీ నిర్మాణం ప్రారంభించింది.

**సంయుక్త కమిటీ ముఖ్య పరిశీలనాంశాలు ఇవీ...**

రెవెన్యూ, హెచ్ఎండీఏ, జలవనరుల శాఖ అధికారులు 29.5.24న క్షేత్రస్థాయిలో ఈ భవంతికి సంబంధించి సంయుక్త విచారణ నిర్వహించి నివేదిక ఇచ్చారు. పట్టాభూమి 9ఎకరాల 19 గుంటల్లో నది వైపు 50 మీటర్ల వరకు బఫర్ జోన్ వదలాల్సి ఉంది. అంటే దాదాపు 3ఎకరాల 9గుంటల స్థలం బఫర్ జోన్ కింద ప్రభావానికి గురవుతుందని నివేదించారు. నదిని ఆక్రమించి నింపిన వ్యర్థాలను, నది మధ్యలో వేసిన భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని, ఒక కాంటా, మిక్సింగ్ ప్లాంటు(బాచింగ్) బఫర్ జోన్‌లో ఉన్నాయని తెలిపారు. లోలెవల్ కాజ్‌వే కూడా మట్టితో పూడిపోయినట్లు గుర్తించారు. బఫర్ జోన్ పరిధిలో కాంక్రీట్ నిర్మాణాలు చేయకూడదని పేర్కొన్నారు. అధికారులు బఫర్ జోన్ హద్దు గుర్తించాలి... అక్కడ బోర్డులు ఏర్పాటు చేయాలి... నది ప్రవాహ మట్టం గుర్తించి బోర్డు ఏర్పాటు చేయాలి అని స్పష్టం చేశారు.

కానీ ఏం జరుగుతోంది... నిర్మాణ స్థలం నదిలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. మూసీ నది వెడల్పు వివిధ ప్రాంతాల్లో ఒక్కో రకంగా ఉంటుంది. కనీసం 50 మీటర్ల నుంచి 100, 200 మీటర్ల వరకు ఉంది. నిర్దేశిత ప్రాంతంలో ఎంత ఉందనేది అధికారులు స్పష్టత ఇవ్వలేదు. కానీ పట్టాభూమి 9ఎకరాల 19 గుంటలకు రేఖా చిత్రం ఇచ్చారు. ఇది నదిలోకి చొచ్చుకు వచ్చింది. అక్కడి నుంచి 50 మీటర్ల దూరం బఫర్ జోన్, 9 మీటర్లు సెట్‌బ్యాక్ వదలాలని సూచించారు. బఫర్‌జోన్ వద్ద కాంక్రీట్ గోడ తొలగించిన సంస్థ ఫెన్సింగ్ వేసింది. నిర్మాణ సామగ్రి నదిలోనే ఉంది. వెనుక వైపు మూసీ చాలా వరకు పూడిపోయింది. కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంటు, కాంటా అలాగే ఉన్నాయి. ఎక్కడా రెవెన్యూ, జలవనరుల శాఖల హెచ్చరిక బోర్డులు లేవు. పూడిపోయిన లోలెవల్ కాజ్‌వేలో మట్టిని తొలగించాలని సూచించినా జరగలేదు. బఫర్ జోన్ 50 మీటర్లనే భవన నిర్మాణ అనుమతుల్లో ఖాళీ స్థలంగా చూపించినట్లు చెబుతున్నారు.

# కోహినూర్ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇచ్చేస్తారా..? బ్రిటన్ మంత్రి ఏమన్నారంటే?

మొదటి పేజీ తరువాయి





అన్నీ సానుకూలంగా జరిగితే.. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం రావొచ్చని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఇదే అంశంపై భారత్ సాంస్కృతిక శాఖ మంత్రితోనూ చర్చించినట్లు చెప్పారు. అధికారిక పర్యటనలో భాగంగా ప్రస్తుతం లీసా నాండీ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా దిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. సృజనాత్మకత, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో భారత్‌లో దృఢమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు లీసా తెలిపారు. “సినిమా, టీవీ, మ్యూజిక్, క్రీడా రంగాల్లో బ్రిటన్ దూసుకుపోతోంది. ఆయా రంగాలకు సంబంధించిన బ్రిటన్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. భారత్ సహకరిస్తే.. వాటిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ల వచ్చన్న గట్టి నమ్మకం మాకుంది. అందుకు భారత్ కూడా మద్దతిస్తుందని ఆశిస్తున్నాం” అని లీసా తెలిపారు. భారత్ పర్యటన కోసం శుక్రవారం దిల్లీ చేరుకున్న ఆమె.. సాంస్కృతిక శాఖకు సంబంధించిన పలు ఒప్పందాల గురించి కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిపైనా ఆమె స్పందించారు. ఈ దారుణఘటనలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, ఉగ్రవాదం నిర్మూలనకు ప్రపంచదేశాలన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కాగా, భారత్‌కు చెందిన 108 క్యారెట్ల విలువైన కోహినూర్ వజ్రాన్ని 1849లో మహారాజ్ దులీప్ సింగ్.. విక్టోరియా మహారాణికి ఇచ్చేశారు. అప్పటి నుంచి ఆ వజ్రం వారి ఆధీనంలోనే ఉంది. రాణి కిరీటంలో అమర్చారు. అయితే, దానిని తిరిగి తీసుకోవాలని భారత ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ప్రయత్నించినప్పటికీ.. అది కార్యరూపం దాల్చలేదు.

మొదటి పేజీ తరువాయి

# రాముడిపై రాహుల్ వ్యాఖ్యలు.. భగ్గుమన్న బీజేపీ నేతలు



అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలోని గొప్ప సామాజిక సంస్కర్తలు, ఆలోచనపరులు మతభ్రష్టులు కాదని రాహుల్ బదులిచ్చారు. బీజేపీ ఆలోచనను హిందుత్వంగా తాను పరిగణించనని అన్నారు. “మన పురాణాల్లోని రాముడు క్షమించే గుణం కలవాడని, బీజేపీ చెప్పేది హిందూ ఆలోచన అని నేను అస్సలు పరిగణించను. హిందూ ఆలోచన అంటే నేను బహుత్వవాదం, ఆలింగనం చేసుకోవడం, ఎక్కువ అప్యాయత, ఎక్కువ సహనం. ప్రతీ దేశంలో అలాంటి ఆలోచన కోసం నిలబడి, జీవించి, ఆ ఆలోచన కోసం మరణించిన వారిని చూశాము. గాంధీ వారిలో ఒకరు.” అని రాహుల్ గాంధీ అన్నారు. అయితే, రాముడు పాత్ర కల్పితం అని అర్థం వచ్చేలా మాట్లాడటంపై బీజేపీ నేతలు భగ్గుమంటున్నారు. రాహుల్ గాంధీ హిందూ వ్యతిరేక మనస్తత్వం కలిగిన వాడని.. రాముడి వ్యతిరేకి అని బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఇంటర్వ్యూలోని ఒక క్లిప్‌ని బీజేపీ షేర్ చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎక్స్ లో రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. “హిందువులను, రాముడిని అవమానించడం కాంగ్రెస్ పార్టీ గుర్తింపుగా మారింది. అఫిడవిట్ ద్వారా రాముడి ఉనికిని తిరస్కరించిన వారు, రామమందిర నిర్మాణాన్ని వ్యతిరేకించిన వారు, హిందూ ఉగ్రవాదాన్ని సృష్టించిన వారు.. ఇప్పుడు రాహుల్ గాంధీని ‘పౌరాణికం’ అంటున్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ రామమందిర ప్రతిష్ఠాపనకు హాజరు కాలేదు. ఇది వారి రామ వ్యతిరేక, హిందూ వ్యతిరేక మనస్తత్వాన్ని చూపిస్తుంది. వారు పాకిస్తాన్ భాషను మాట్లాడతారు. సైన్యం నైతికతను దెబ్బతీస్తారు. వారు రాముడికి, భారతదేశానికి వ్యతిరేకులు. ప్రజలు దీన్ని క్షమించరు” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి రాహుల్ పై మండిపడ్డారు. “శ్రీరాముడు కేవలం పౌరాణిక వ్యక్తి: ఇది కాంగ్రెస్ మనస్తత్వం. హిందూ విశ్వాసాలను అపహాస్యం చేయడం, రాముడిని ప్రశ్నించడం, ఎన్నికలు రాగానే సనాతన ప్రేమను నటించడం కాంగ్రెస్ కు అలవాటే. ఆ పార్టీ హిందూ వ్యతిరేకి” అని కాంగ్రెస్‌పై ఫైర్ అయ్యారు.

# సీబీఎస్ఈ ఫలితాల వదంతులు.. బోర్డ్ క్లారిటీ




ఈ కబురు : సీబీఎస్ఈ ఫలితాల వదంతుల పై బోర్డు క్లారిటీ ఇచ్చింది. 10వ, 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాలు మే 6న విడుదలవుతాయని సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతుండగా అవన్నీ ఫేక్ వార్తలుగా కొట్టిపడేసింది బోర్డ్. అయితే సోమవారం ఉదయం 11 గంటలకు సీబీఎస్ఈ 10వ, 12వ తరగతుల ఫలితాలు విడుదల అవనున్నాయని వస్తున్న వదంతులను ఖండిస్తూ బోర్డ్ అధికారులు ఓ లేఖను విడుదల చేశారు. తాము ఎలాంటి ప్రకటన చేయలేదని తేల్చి చెప్పింది. విద్యార్థులు, తల్లిదండ్రులు అలాంటి వార్తలను నమ్మకూడదు అని కోరింది.

తాము ఏదైనా సమాచారం విడుదల చేస్తే దానిని తమ అధికారిక వెబ్సైట్ లో పొందుపరుస్తామని పేర్కొంది. కాగా ఈ ఏడాది అకడమిక్ ఇయర్ లో 10వ, 12వ తరగతి పరీక్షలకు దేశవ్యాప్తంగా దాదాపు 42 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 10వ తరగతికి చెందిన 24.12 లక్షల మంది విద్యార్థులు ఉండగా.. 12వ తరగతికి చెందిన విద్యార్థులు 17.88 లక్షల మంది ఉన్నారు. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు దేశవ్యాప్తంగా 7,842 కేంద్రాలలో విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు.w

మొదటి పేజీ తరువాయి

# ‘అది నా బాధ్యత.. మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుంది’: రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



ఈ కబురు,దిల్లీ: భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం రక్షణ మంత్రిగా తన బాధ్యత అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పని తీరు, పట్టుదల గురించి అందరికీ తెలుసన్న రాజ్‌నాథ్.. ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరిగి తీరుతుందని తాను హామీ ఇస్తున్నానన్నారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు, పాక్‌పై ప్రతీకార చర్యలను కేంద్రం పరిశీలిస్తున్న వేళ రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. దిల్లీలో జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. “మన వీర సైనికులు ఎల్లప్పుడూ దేశ భౌతిక స్వరూపాన్ని కాపాడుతుంటే.. రుషులు, జ్ఞానులు దేశ ఆధ్యాత్మిక రూపాన్ని పరిరక్షిస్తున్నారు. ఒక వైపు మన సైనికులు యుద్ధ భూమిపై పోరాడుతుంటే.. సాధువులు జీవన భూమిపై పోరాడుతున్నారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం నా బాధ్యత. దేశంపై దాడికి ప్రయత్నించేవారికి తగిన రీతిలో బదులివ్వడం నా విధి. మీకు మన ప్రధాని గురించి బాగా తెలుసు. ఆయన వర్కింగ్ స్టైలేంటో, పట్టుదల ఏంటో తెలుసు. ఆయన సారథ్యంలో మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుందని మీకు హామీ ఇస్తున్నా. భారత్ శక్తి సాయుధ దళాల్లోనే కాదు.. దాని సంస్కృతి, ఆధ్యాత్మికతలోనూ ఉంది” అని వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రధాని మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ కీలక భేటీ.. ఏం జరగనుంది?



ఇదిలా ఉండగా.. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశ సైనిక దళాలకు ఆయుధాలను సరఫరా చేసే మ్యునిషన్స్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన రెండు ఆయుధ కర్మాగారాల సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా కర్మాగారంతోపాటు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా ఖమరియాలో ఉన్న ఆర్డినన్స్ ఫ్యాక్టరీ సిబ్బందికి శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ భద్రతతోపాటు ప్రస్తుత కీలక సమయంలోని నిర్వహణ అత్యవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చంద్రపుర్ జిల్లా కర్మాగారం అధికారులు పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఉత్పత్తి లక్ష్యాలను సాధించలేకపోయామని, ఆ లోటును భర్తీ చేయడానికే దీర్ఘకాల సెలవులను తక్షణం రద్దు చేస్తున్నట్లు ఖమరియా ఫ్యాక్టరీ అధికారులు తెలిపారు.

# పాక్‌కు భారత్ మరో షాక్.. ఆ రెండు నదుల నీటి సరఫరా బంద్ !



చీనాబ్ నదిపై ఉన్న బాగ్లిహార్ ఆనకట్ట ద్వారా నీటి సరఫరా అడ్డుకుంది. పాక్‌కు నీటి సరఫరా ఆపేందుకు డ్యామ్ గేట్లను కిందకు దించినట్టు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయంతో పాక్‌లోని పంజాబ్ ప్రావీన్స్‌పై తీవ్ర ప్రభావం పడనున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఈ ఆనకట్ట ద్వారా పంజాబ్ ప్రావీన్సుకు నీరు సరఫరా అవుతుంది. అంతేగాక అక్కడి వ్యవసాయం సైతం ఈ నదిపైనే ఆధారపడి ఉంది. దీంతో ఆ ప్రావీన్సుకు చెందిన ప్రజలు ఆందోళనకు గురికాక తప్పదని పలువురు భావిస్తున్నారు. జీలం నీటినీ ఆపేందుకు సన్నాహాలు చీనాబ్ నది నీటిని అడ్డుకున్న భారత్ ఇప్పుడు జీలం నదిపైనా ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. జీలం ఉపనది అయిన కిషన్‌గంగా ఆనకట్ట వద్ద కూడా త్వరలో ఇలాంటి చర్య తీసుకోవాలని ప్రణాళిక వేసినట్టు సమాచారం. జమ్మూలోని రాంబన్ జిల్లాలో ఉన్న బగ్లిహార్ ఆనకట్ట, ఉత్తర కశ్మీర్‌లోని కిషన్‌గంగా ఆనకట్టలు భారత్‌కు నీటిని నిల్వచేసి విడుదల చేసే సామర్థ్యాన్ని ఇస్తాయని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ ఆనకట్టల ద్వారా పాకిస్తాన్‌కు చేరే నీటిని తగ్గించొచ్చని, ముందస్తు హెచ్చరిక లేకుండా నీటిని విడుదల చేయొచ్చు. ఈ నేపథ్యంలోనే భారత్ తాజా నిర్ణయం తీసుకుంది. బాగ్లిహార్, కిషన్‌గంగాలపై వివాదం! బాగ్లిహార్ ఆనకట్ట విషయంలో భారత్, పాక్ మధ్య చాలాకాలంగా వివాదం ఉంది. ప్రపంచ బ్యాంకు జోక్యం తర్వాత ఈ కాంట్రవర్సీ పరిష్కారమైంది. అలాగే కిషన్ గంగా ఆనకట్టకు సంబంధించి కూడా సమస్య ఉంది. జీలం ఉపనది అయిన నీలం నదిపై కిషన్‌గంగా ఆనకట్ట ప్రభావం ఉన్నందున పాకిస్తాన్ చట్టపరంగా, దౌత్య పరంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. భారత్ నుంచి పాకిస్థాన్ కు ప్రవహించే ఈ నదులను రెండు దేశాల జీవనాధారాలుగా పరిగణిస్తారు. ఈ నదులపైనే వ్యవసాయం సైతం ఆధారపడి ఉంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న భారత్ ఇప్పటి వరకు ఎటువంటి ఆటంకం లేకుండా నీటిని అందిస్తోంది. కానీ ఉగ్రదాడి అనంతరం పాక్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్న భారత్ నీటిని ఆపివేయడంతో పాక్ ఆందోళన చెందడం ఖాయమని తెలుస్తోంది.

# దక్షిణ తెలంగాణకు గత ప్రభుత్వం అన్యాయం చేసింది: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి

**మిర్యాలగూడలో ఉమ్మడి నల్గొండ జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం కేవలం కాళేశ్వరంపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని, దక్షిణ తెలంగాణకు చేసిన అన్యాయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేయలేదని.. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమ ప్రాజెక్టులను పట్టించుకోలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.23వేల కోట్లు కేటాయించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.**



# కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఇవాళ(ఆదివారం) కోదాడ పట్టణంలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ... దేశంలో మొట్టమొదటిగా బీసీ కుల గణనను తెలంగాణ పూర్తి చేసిందని అన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

ఈ కబురు,తెలంగాణలో చేసిన బీసీ కులగణనను కేంద్రం అవలంబిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బీసీ చట్టం చేసింది కాంగ్రెస్ పార్టీనే, జనాభాకు అనుగుణంగా బీసీలకు న్యాయం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అలాగే కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల పనులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రెడ్లకుంట, శాంతినగర్, పాలేరుమోతె ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులపై సమీక్షించారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గంలోని ఎన్ఎస్పీ కాల్వలపై కూడా అధికారులతో మాట్లాడారు. అధికారుల పని తీరుపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

**దేశంలో సమగ్రమైన కులగణన జరగాలి: గిడుగు రుద్రరాజు**

ఢిల్లీ: దేశంలో సమగ్రమైన కులగణన జరగాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి కులగణనకు కట్టుబడి ఉందని అన్నారు. ఇవాళ(ఆదివారం) ఢిల్లీ వేదికగా గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. 1951లో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ కులగణనను వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఒత్తిడితో కేంద్రం కులగణన నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆర్టికల్ 15 (5)ను బలహీన వర్గాలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ కల్పించిందని.. దీనిని మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు అమలు పరచడం లేదని గిడుగు రుద్రరాజు ప్రశ్నించారు.

ఆర్టికల్ 15 (5)ను బలహీన వర్గాలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు అమలు పరచాలని గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం సమగ్రమైన కులగణన జరిపిందని చెప్పారు. ప్రజల నుంచి సమగ్ర వివరాలను రేవంత్ ప్రభుత్వం కులగణన ద్వారా తెలుసుకుందని అన్నారు. 2011లో జరిగిన జనాభా లెక్కల వివరాలను పార్లమెంట్ ముందు బీజేపీ ప్రభుత్వం ఎందుకు ఉంచలేదని నిలదీశారు. కోవిడ్ సాకుతో 2021లో మోదీ ప్రభుత్వం జనగణన చేయలేదని అన్నారు. మోదీ ప్రభుత్వం జాతీయ స్థాయిలో సమగ్ర కులగణన జరపాలని కోరారు. మే చివరి వరకు దేశవ్యాప్తంగా సంవిదాన్ బచావో ర్యాలీలో భాగంగా కుల గణనపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కులగణన ఎప్పటి వరకు పూర్తి చేస్తారో మోదీ ప్రభుత్వం స్పష్టం చేయాలని గిడుగు రుద్రరాజు కోరారు. మీ సహకారాన్ని మీరు చేసిన త్యాగాన్ని మేము ఎన్నటికీ మరువలేమని మేము ఎల్లప్పుడూ కుటుంబ పెద్దలుగా మీ మేలు కోరే విధంగా బాధ్యత అధికంగా మసులుకుంటామని వివరిస్తూ ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు దేవరకొండ సైదులు, మల్లెల రవీంద్రప్రసాద్, జడ్ ఎస్ జయపాల్ విజయకుమార్, సగుర్తి ప్రకాష్ రావు, ఎర్ర రమేష్, పర్వతపు శ్రీనివాస్, రవికుమార్, కె రుక్మారావు, ఎస్ లలిత కుమారి, ఎర్రమల శ్రీనివాస్, బుసా చంద్రశేఖర్, బిట్టా ప్రవీణ్ కుమార్, జంగం లక్ష్మణ్ రావు, వేమిశెట్టి కృష్ణారావు, బెజ్జంకి ఉపేంద్ర చారి, చెర్ల శ్రీనివాస్, ఎస్ కె సైదులు, కందుల విజయ్, దామల్ల వెంకటేశ్వర్లు, (సి ఎం), బందెల లలిత,కామల్ల రవితేజ, ఎన్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

# ఖాజాగూడలో నూతన వి వ్రాప్ గిఫ్టింగ్ స్టూడియో



వి వ్రాప్ గిఫ్టింగ్ స్టూడియోను ప్రారంభిస్తున్న సాయిబాబా

**ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ సాయిబాబా**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఐటీ కారిడార్ పరిధిలోని ఖాజాగూడలో నూతన వి వ్రాప్ గిఫ్టింగ్ స్టూడియోను ఏర్పాటు చేశారు. ఖాజాగూడలోని చిత్రపురి కాలనీ దారిలో ఏర్పాటు చేసిన ఈ వ్యాపార సముదాయాన్ని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన వ్యాపార సముదాయాన్ని ప్రారంభించిన నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో గిఫ్ట్ ఐటమ్స్ కోసం ఎంతో దూరం వెళ్ళేవారిమని, కానీ నేడు ఐటీ కారిడార్, గచ్చిబౌలి డివిజన్ పరిసర ప్రాంతాల ప్రజలకు వి వ్రాఫ్ గిఫ్టింగ్ స్టూడియో అందుబాటులోకి రావడం అభినందనీయమని అన్నారు. వ్యాపారాలు అభివృద్ధి చెందాలంటే నిర్వాహకులు ఎల్లప్పుడూ కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని సామాగ్రిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వి వ్రాప్ గిఫ్టింగ్ స్టూడియో నిర్వాహకులు హరి కృష్ణ, స్నేహ, డిఎస్ఆర్ గ్రూప్ డైరెక్టర్ అమూల్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిర్వాహకులతో కలిసి మాజీ కార్పొరేటర్ సాయిబాబా

# భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత.. కరాచీ తీరానికి తుర్కియే యుద్ధనౌక



**తుర్కియేకు చెందిన ‘ టీజీసీ బుయుకడా’ అనే భారీ యుద్ధ నౌక కరాచీ తీరాన్ని చేరింది. 2013లో జలప్రవేశం చేసిన ఈ నౌక జలాంతర్గాములకు వ్యతిరేకంగా పని చేయగలదు. గస్తీ కాయడంలో దీనిది అందవేసిన చేయి.**

ఈ కబురు: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. భారత్‌లోని పాక్ జాతీయులను దేశం నుంచి వెళ్లగొట్టడమే కాకుండా.. సింధు నదీ జలాల ఒప్పందం రద్దు, పాక్ విమానాలకు భారత్ గగనతలం మూసివేయడం, దిగుమతులను స్తంభింపజేయడం లాంటి చర్యలతో పాక్‌ను అన్నివైపుల నుంచి భారత్ బంధిస్తోంది. ఈ క్రమంలో ఎప్పుడు ఎలాంటి పరిణామాలను చవిచూడాల్సి వస్తుందోనని, పాకిస్థాన్ భయాందోళనలకు గురవుతోంది. మద్దతు కూడగట్టుకునేందుకు యత్నిస్తోంది.

ఈ క్రమంలోనే తన మిత్రదేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు భారత్‌కు సమాచారం ఉంది. దానికి మరింత బలం చేకూర్చేలా.. తాజాగా తుర్కియేకు చెందిన ‘ టీజీసీ బుయుకడా’ అనే భారీ యుద్ధ నౌక కరాచీ తీరాన్ని చేరింది. 2013లో జలప్రవేశం చేసిన ఈ నౌక జలాంతర్గాములకు వ్యతిరేకంగా పని చేయగలదు. గస్తీ కాయడంలో దీనిది అందవేసిన చేయి. పలు నౌకాదళ విన్యాసాల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకుంది. పాకిస్థాన్‌కు చెందిన నౌకలకు జలమార్గాలను భారత్ నిషేధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాల ఉన్నతాధికారులతో వరుస భేటీలు నిర్వహిస్తుండంతో భారత్ ఏ క్షణమైనా ఎదురుదాడి చేయవచ్చని పాకిస్థాన్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సముద్రమార్గంలోనూ దాడి చేసే అవకాశం ఉన్నందున తుర్కియేను సంప్రదించి.. గస్తీ నౌకను తెచ్చుకున్నట్లు తెలుస్తోంది.ఉన్నత స్థాయి సమావేశానికి పీటీఐ దుమ్మా! భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించేందుకు ఆర్మీ ఉన్నతాధికారులు, ప్రతిపక్ష పార్టీలతో కలసి ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించింది. చేపట్టబోయే కార్యాచరణ గురించి పాక్ ఆర్మీ అధికారులు.. వివిధ పార్టీల నేతలకు వివరించాలని భావించారు. అయితే, ఈ సమావేశానికి హాజరుకాబోమని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ ఈఇన్సాఫ్ (పీటీఐ) వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. చాలా కాలంగా ఉగ్రవాదాన్ని పీటీఐ ఖండిస్తోందని,

# ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ఉపయోగించే పరిస్థితి రాదు : పుతిన్

**ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ఉపయోగించబోమని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు.**

ఈ కబురు: ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ఉపయోగించే అవసరం తలెత్తదని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఆ పరిస్థితి ఏర్పడదని తాను ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు. రష్యా అధికారిక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదానికి తార్కిక ముగింపు తీసుకురావడానికి రష్యా వద్ద బలం ఉందని ఆయన పేర్కొన్నారు.రష్యన్ భూభాగంపై ఉక్రెయిన్ దాడుల గురించి అడిగిన ప్రశ్నకు పుతిన్ సమాధానమిస్తూ “ఆ దేశంపై అణ్వాయుధాలను ఉపయోగించాల్సిన అవసరం రష్యాకు లేదు. 2022లో ప్రారంభించిన యుద్ధాన్ని రష్యా కోరుకునే విధంగా ముగించడానికి మా వద్ద తగిన బలం, వనరులు ఉన్నాయి” అని చెప్పారు. 2024 నవంబర్‌లో రష్యా అణు సిద్ధాంతం పునరుద్ధరణ పత్రాలపై పుతిన్ సంతకం చేశారు. ప్రపంచంలోని అతిపెద్ద అణు ఆయుధాగారాన్ని ఉపయోగించుకోవడానికి వీలు కల్పించే పరిస్థితులను ఆయన వివరించారు. అయితే.. ఉక్రెయిన్‌పై ఆ అవసరం రాదని తాజాగా స్పష్టం చేశారు. రష్యాఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృషి చేస్తున్న విషయం తెలిసిందే. వివాదాన్ని దౌత్య మార్గాల్లో ముగించాలని ట్రంప్ చెప్పగా.. శాంతి పరిష్కారం కోసం చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పుతిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు రష్యా నిర్వహిస్తున్న ‘విక్టరీ డే’ కవాతుకు హాజరయ్యే విదేశీ ప్రముఖుల ప్రాణాలకు తాను హామీ ఇవ్వలేనంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరిక జారీ చేశారు. ‘విక్టరీ డే’ 80వ వార్షికోత్సవాలను ఈ నెల 9న భారీగా నిర్వహించడానికి మాస్కో సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను ఉక్రెయిన్ ముందు మాస్కో ఉంచింది. దీన్ని జెలెన్‌స్కీ శనివారం తిరస్కరించారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం: హరీశ్‌రావు



ఈ కబురు,హైదరాబాద్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల మేర ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు.సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# మావోయిస్టులతో మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.**

ఈ కబురు,కరీంనగర్: మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. “తుపాకీతో అమాయకులను చంపేవారితో చర్చలు ఉండవు. మావోయిస్టులతో ఇక మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్. వారిపై నిషేధం విధించింది కాంగ్రెస్సే. మావోయిస్టులు.. పలు పార్టీల నేతలను మందుపాతరలు పెట్టి చంపారు. ఇన్‌ఫార్మర్ల పేరుతో గిరిజనులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారు. ఎన్నో గిరిజనుల కుటుంబాలకు మానసిక క్షోభ మిగిల్చారు. తుపాకీ వదిలిపెట్టేవరకు మావోయిస్టులతో చర్చల ఊసే ఉండదు. పాస్‌పోర్టు లేని విదేశీయులను గుర్తించి పంపిస్తున్నాం. రోహింగ్యాలపై తన వైఖరి ఏమిటో కాంగ్రెస్ పార్టీ చెప్పాలి” అని బండి సంజయ్ అన్నారు.

# పాక్ కోసం ‘ఇగ్లా’లు సిద్ధం చేసిన భారత్..!



**పాకిస్థాన్‌లో ఘర్షణ వాతావరణం నెలకొన్న వేళ భారత్ అదనంగా స్వల్పశ్రేణి ఎయిర్ డిఫెన్స్ ఆయుధాలు కొనుగోలుకు టెండర్ విడుదల చేసింది.**

సంక్షోభ సమయంలో వాడేందుకు వీలుగా భారత్ స్వల్ప శ్రేణి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా సిద్ధం చేస్తోంది. కొన్నాళ్ల క్రితమే రష్యా తయారీ ఇగ్లాఎస్ మిసైల్స్ దిగుమతి చేసుకొంది. ఇవి వెరీషార్ట్ రేంజి ఎయిర్ డిఫెన్స్ కిందకు వస్తాయి. సైనికదళాలకు ప్రభుత్వం ఇచ్చిన ఎమర్జెన్సీ ప్రొక్యూర్‌మెంట్ పవర్స్‌ను వాడి వీటిని కొనుగోలు చేశారు. వాస్తవానికి కొన్ని వారాల క్రితమే ఇవి భారత్‌కు చేరుకొన్నాయి. ఈ క్రమంలో సంక్షోభం తలెత్తడంతో ప్రత్యర్థులకు సమాధానం ఇచ్చేందుకు వీటిని సిద్ధం చేస్తోంది. ఈ స్వల్పశ్రేణ క్షిపణులతో ఫైటర్ జెట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఛాపర్స్, డ్రోన్లను ధ్వంసం చేయవచ్చు.

దాదాపు రూ.260 కోట్ల వ్యయంతో వీటిని కొనుగోలు చేశారు. ముఖ్యంగా పశ్చిమ సెక్టార్లో సరిహద్దుల వద్ద వాడేందుకు ఇవి అత్యంత అనువుగా ఉంటాయి. భారత వాయుసేన అమ్ములపొదిలో కూడా ఇవి ఉన్నాయి. ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కింద ఇటీవల కాలంలో ఆయుధాల విడిభాగాలు వంటివి కూడా దిగుమతి చేసుకొంటున్నారు. దళాలను యుద్ధ సన్నద్ధతగా ఉంచడానికి ఇవి బాగా ఉపయోగపడుతన్నాయి. తాజాగా కూడా 48 లాంచర్లు, 90 ఇగ్లాఎస్ క్షిపణుల కోసం సైన్యం టెండర్ విడుదల చేసింది. వీటిని ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కిందే కొనుగోలు చేయనున్నాయి. వీటితోపాటు కొత్త తరం ఇగ్లాలపై కూడా దృష్టిపెట్టారు. వీటికి లేజర్‌బీమ్ రైడింగ్ సామర్థ్యం కూడా ఉంది.

1990 నుంచి ఇగ్లాను భారత్ సైన్యం వినియోగిస్తోంది. దేశీయంగా ఉన్న సంస్థలు వీటిల్లో మార్పుతో ఇగ్లాఎస్ వెర్షన్ సిద్ధం చేశాయి. పాక్ సైన్యం పలు రకాల డ్రోన్లు, యూఏవీలు వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇగ్లాఎస్ క్షిపణుల అవసరం భారత్‌కు ఎక్కువగా ఉండొచ్చని భావిస్తున్నారు. వీటిలతోపాటు మన దళాలు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్‌ను కూడా మోహరించనుంది.

# ధీరూభాయ్ అంబానీ అసలు పేరేంటో తెలుసా ?



భారదేశంలో అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీ.. రిలయన్స్ సామ్రాజ్యం గురించి తెలిసిన దాదాపు అందరికీ, ఈ కంపెనీ ప్రారంభించిన వారు ధీరూభాయ్ అంబానీ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ధీరూభాయ్ అంబానీ అసలు పేరు ఏమిటో.. బహుశా చాలా తక్కువమందికే తెలిసి ఉంటుంది. ఈ కథనంలో ఆ విషయం తెలుసుకుందాం.

సాధారణ కుటుంబంలో జన్మించిన ధీరూభాయ్ అంబానీ.. ఆర్థిక పరిస్థితుల కారణంగా, చదువును అర్ధాంతరంగా నిలిపివేసి యెమెన్‌కు వెళ్లి అక్కడ పెట్రోల్ పంప్‌లో రూ. 300 జీతానికి పనిచేయడం మొదలుపెట్టారు. కొన్నేళ్ల తరువాత సొంతంగా ఏదైనా చేయాలనే ఉద్దేశ్యంతో ఇండియాకు వచ్చి.. ముంబైలోని అద్దె ఇంట్లో రిలయన్స్ ప్రయాణాన్ని ప్రారంభించారు.

వస్త్రాల వ్యాపారంతో మొదలైన ఈయన ప్రయాణం.. ఆ తరువాత పెట్రోకెమికల్స్, టెలికాం మొదలైన రంగాలవైపు సాగింది. ఆ తరువాత రిలయన్స్ ఓ పెద్ద వ్యాపార సామ్రాజ్యంగా మారింది. అందరూ ఈయనను 'ధీరూభాయ్ అంబానీ' అని పిలుచుకునే వారు. కానీ ధీరూభాయ్ అనేది ఆయన ముద్దుపేరు, అంబానీ అనేది ఇంటిపేరు.

ధీరూభాయ్ అంబానీ అసలు పేరు.. 'ధీరజ్‌లాల్ హీరాచంద్ అంబానీ' . 1932 డిసెంబర్ 28న జన్మించిన ఈయన.. ఏడుపదుల వయసులో 2002 జులై 6న మరణించారు. అప్పటికే రిలయన్స్ సామ్రాజ్యాన్ని దశదిశలా వ్యాపింపజేశారు. ఆయన మరణించే సమయానికి, ప్రపంచంలో 138వ ధనవంతుడిగా ఉన్నట్లు.. ఆయన వ్యక్తిగత నికర విలువ 2.9 బిలియన్ డాలర్లు (నేటి భారత కరెన్సీ ప్రకారం రూ. 24000 కోట్లు) అని సమాచారం.




## సెకీతో రిలయన్స్ న్యూ సన్‌టెక్ ఒప్పందం

ముంబై: రిలయన్స్ పవర్ అనుబంధ సంస్థ రిలయన్స్ న్యూ సన్‌టెక్ తాజాగా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ)తో పాతికేళ్ల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుంది.

ఒప్పందం ప్రకారం వచ్చే 24 నెలల్లో సమీకృత సోలార్ అలాగే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బీఈఎస్ఎస్) ప్రాజెక్టును నిర్మించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుపై రూ. 10,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. కేడబ్ల్యూహెచ్‌కి రూ. 3.53 ఫిక్సిడ్ రేటు చొప్పున విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుంది.




## ఐదు బ్యాంకులపై ఆర్‌బీఐ కొరడా.. భారీ జరిమానా




నిబంధనలు పాటించడంలో విఫమైతే 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' .. ఏ బ్యాంకుపై అయిన కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్‌లతో సహా మొత్తం ఐదు బ్యాంకులకు ఆర్‌బీఐ జరిమానాలు విధించింది.

బ్యాంకులలో సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్,కేవైసీ, క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్ మొదలైనవాటికి సంబంధించిన ఆదేశాలను పాటించనందుకు ఐసీఐసీఐ బ్యాంకుకు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 97.80 లక్షల జరిమానా విధించింది.

కస్టమర్ సేవలు, బ్యాంకులు అందించే ఆర్థిక సేవలకు సంబంధించిన కొన్ని మార్గదర్శకాలను పాటించడంలో బ్యాంక్ ఆఫ్ బరోడా విఫలమైందని.. ఆర్‌బీఐ రూ. 61.40 లక్షల జరిమానా విధించింది. అంతర్గత ఖాతాల అనధికార నిర్వహణకు సంబంధించిన కొన్ని ఆదేశాలను పాటించనందుకు యాక్సిస్ బ్యాంకుకు కూడా రూ. 29.60 లక్షల జరిమానా పడింది.

కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా పొందిన వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల కోసం స్వల్పకాలిక రుణాలకు వడ్డీ రాయితీ పథకంపై కొన్ని ఆదేశాలను పాటించనందుకు ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్‌పై కేంద్ర బ్యాంకు రూ. 31.8 లక్షలు, కేవైసీకి సంబంధించిన కొన్ని ఆదేశాలను పాటించనందుకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు రూ. 31.80 లక్షల జరిమానా విధించింది.



## మరిన్ని కంపెనీలు కొంటాం: ప్రముఖ సీఈవో

న్యూఢిల్లీ: వేల్యుయేషన్ సముచితంగా ఉంటే మరిన్ని కంపెనీలను కొనుగోలు చేస్తామని 'యూనికామర్స్ ఈసొల్యూషన్స్' సీఈవో కపిల్ మఖీజా తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ–కామర్స్ విభాగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకున్నాయని, ఆమ్నిచానల్‌లాంటి కొత్త మోడల్స్ తెరపైకి వచ్చాయని ఆయన చెప్పారు.

కంపెనీ ఇటీవలే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫాం షిప్‌వేను కొనుగోలు చేసిన నేపథ్యంలో కపిల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూనికామర్స్ ప్రస్తుతం 7,000 పైచిలుకు వ్యాపారాలకు సేవలు అందిస్తోందని ఆయన వివరించారు. ఈ–కామర్స్ వ్యవస్థలో కస్టమర్లతో సంప్రదింపుల దశ, లావాదేవీలను ప్రాసెస్ చేసే దశ, ఆర్డరును పూర్తి చేసే దశ అని మూడు దశలు ఉంటాయని, తమ సంస్థ ఈ మూడు అంశాల్లోనూ సర్వీసులు అందిస్తోందని కపిల్ వివరించారు. తాము ఇప్పటికే భారత్ కాకుండా ఆరు దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నామని, మరింతగా విస్తరించే యోచనలో ఉన్నామని ఆయన పేర్కొన్నారు.



## ఏప్రిల్‌లో 4.80 లక్షల సేల్స్: ఈ బ్రాండ్ వాహనాలకే డిమాండ్!

హోండా మోటార్‌సైకిల్ & స్కూటర్ ఇండియా 2025 ఏప్రిల్ నెల అమ్మకాల గణాంకాలను విడుదల చేసింది. కంపెనీ గత నెలలో 4,80,896 యూనిట్ల అమ్మకాలు జరిగి-పింది. ఇందులో దేశీయ అమ్మకాలు 4,22,931 యూనిట్లు కాగా.. ఎగుమతులు 57,965 యూనిట్లు. 2024 ఏప్రిల్ నెలతో పోలిస్తే.. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అమ్మకాలు 11.26 శాతం తగ్గాయి.

ఏప్రిల్ నెలలో.. అభివృద్ధి చెందుతున్న మార్కెట్ అవసరాల-కు అనుగుణంగా హెచ్ఎంఎస్ఐ లేటెస్ట్ అప్‌గ్రేడ్‌లను కలిగి ఉన్న డియో 125 అప్డేట్ వెర్షన్ ప్రవేశపెట్టింది. అంతే కాకుండా ప్రీమియం మోటార్‌సైకిల్ పోర్ట్‌ఫోలియోను వి-స్తరించడంలో భాగంగా.. సీబీ350, సీబీ350 హైనెస్, సీబీ-350ఆర్ఎస్ 2025 ఎడిషన్‌లను.. కొత్త కలర్ ఆప్షన్లతో మా-ర్కెట్లోకి తీసుకొచ్చింది.

హోండా మోటార్‌సైకిల్ వాహనాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఎప్పటి-కప్పుడు కొత్త వాహనాలను లాంచ్ చేస్తోంది. ఈ కారణం-గానే మార్కెట్లోని ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇస్తూ.. ఆశించిన అమ్మకాలను పొందగలుగుతోంది.

# హీరోయిన్ వెయిట్ లాస్ జర్నీ.. వీడియో వైరల్

హీరోయిన్లు తమ గ్లామర్ ఎప్పటికీ కాపాడుకుంటూనే అవకాశాలు వస్తుంటాయి. ఏ మాత్రం అజాగ్రత్త వహించి, నోటికొచ్చింది తిన్నా, జిమ్ చేయకపోయినా బరువు పెరిగిపోతారు. ఇప్పుడు అలానే బరువు పెరిగిపోయిన ఓ టాలీవుడ్ హీరోయిన్.. తన వెయిట్ లాస్ జర్నీ మొదలుపెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియోని ఇన్ స్టాలో పోస్ట్ చేసింది.

స్వతహాగా కిక్ బాక్సర్ అయిన రితికా సింగ్.. 'సాలా ఖాదుస్' తమిళ సినిమాతో హీరోయిన్ అయింది. ఈ మూవీనే తెలుగులో వెంకటేశ్ 'గురు'గా రీమేక్ చేశారు. గత కొన్నాళ్లలో తమిళంలోనే వరస సినిమాలు చేస్తున్న ఈ బ్యూటీ.. ఈ మధ్యనే ఎందుకో బరువు పెరిగింది. సరిగ్గా మూడు నెలల్లో మళ్లీ తగ్గిచూపించింది. ఈ వీడియోనే ఇప్పుడు పోస్ట్ చేసింది.

'గత మూడు నెలల్ని అస్సలు మర్చిపోలేను. ఎందుకంటే ఇప్పటివరకు లేనంతగా బరువు పెరిగాను. మరోవైపు మోకాళ్ల గాయం పరిస్థితి దారుణంగా తయారైంది. నొప్పి తట్టుకోలేకపోయాను. కదల్లేకపోయాను. డ్యాన్స్ కూడా చేయలేకపోయాను. దీంతో నన్ను నేను ఓసారి అద్దంలో చూసి.. ఇక చాలు అని నాతో నేనే చెప్పుకొన్నా.'

'ఇక ఫుడ్ తో నా రిలేషన్ షిప్ విషయానికొస్తే ఇప్పుడు చాలా చెడు అలవాట్లని నా కంట్రోల్ లో పెట్టుకున్నాను. దీనికోసం చాలా సవాళ్లు ఎదుర్కొన్నాను' అని రితికా సింగ్ చెప్పుకొచ్చింది.






## విజయ్ సేతుపతి– నిత్యా మీనన్ 'టైటిల్' టీజర్ విడుదల

కోలీవుడ్ నటుడు విజయ్ సేతుపతి కొత్త సినిమా టైటిల్ ప్రకటించారు. 'తలైవా తలైవి' టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. దీనిని ప్రకటిస్తూ తాజాగా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంతో జాతీయ అవార్డ్ విన్నింగ్ హీరోయిన్ నిత్యామీనన్ ఆయనకు జోడీగా నటిస్తున్నారు. సత్యజ్యోతి ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నటుడు యోగిబాబు, సెంబన్ వినోద్ జోస్, దీపా శంకర్, శరవణన్, రోషిణి హరిప్రియన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలో విడుదల కానుంది.

ఇకపోతే ఇందులో నటుడు విజయ్ సేతుపతి పరోటా మాస్టర్‌గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం ఆయన కొంత శిక్షణ పొందినట్లు సమాచారం. గతంలో '19 (1)(ఎ)' సినిమాలో విజయ్ సేతుపతి, నిత్యామీనన్ స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఈ ఇద్దరూ పాండిరాజ్ సినిమా కోసం మరోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను మెప్పించేలా ఉంది.

నిత్యామీనన్, విజయ్ సేతుపతి కలిసి కిచెన్‌లో వంటను ప్రిపేర్ చేస్తూనే గొడవపడుతూ ఉంటారు. వారిద్దరూ సరదాగా పోట్లాడుకుంటూ భార్యాభర్తలుగా కనిపిస్తారు. ఒకరిపైమరొకరు పెద్దగా అరవడం మొదలు పెడుతారు. అప్పుడు విజయ్ చేసేదేం లేక తన నోటికి టవల్‌ని కట్టుకొని తనలో తాను మాట్లాడుకుంటూ ఉండిపోతాడు. ఈ మూవీలో నిత్యామీనన్ డామినేషన్ ఎక్కువగా కనిపించేలా ఉంది.



## డైరెక్టర్‌గా సలార్ సంగీత దర్శకుడు.. తెలుగు టీజర్ చూశారా!

కేజీఎఫ్, సలార్ వంటి యాక్షన్ చిత్రాలతో సంగీత దర్శకుడిగా సంచలనం సృష్టించిన రవి బస్రూర్. ఆ తర్వాత వీర చంద్రహాస చిత్రంతో దర్శకుడిగా తన సత్తా చాటారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రంలో శిథిల్ శెట్టి, నాగశ్రీ జిఎస్, ప్రసన్న శెట్టిగార్, ఉదయ్ కడబాల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఓంకార్ మూవీస్ బ్యానర్‌పై ఎన్ఎస్ రాజ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం, ఏప్రిల్ 18న కన్నడలో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది.

ఈ నేపథ్యంలోనే వీర చంద్రహాస మూవీ తెలుగు టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. యక్షగానం ఇతివృత్తం ఆధారంగా ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. కాగా.. కన్నడలో సూపర్ హిట్ కావడంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ విడుదల చేయనున్నారు. గతంలో శివరాజ్ కుమార్ నటించిన 'వేద', ప్రజ్వల్ దేవరాజ్ నటించిన రాక్షస చిత్రాలను తెలుగులో విజయవంతంగా రిలీజ్ చేశారు. తాజాగా వీర చంద్రహాస మూవీ రైట్స్‌ను ఆయనే సొంతం చేసుకున్నారు. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. కన్నడలో సూపర్ హిట్ అయినా ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను ఎంతవరకు అలరిస్తుందో వేచి చూడాల్సిందే.

## అసలే తెలుగమ్మాయిని.. ఇంతకీ సినిమాలో ఉన్నానా?: డైరెక్టర్‌తో లయ

రాబిన్‌హుడ్ తర్వాత నితిన్ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం తమ్ముడు. ఈ సినిమాకు వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ చివరిదశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. డైరెక్టర్ వేణు శ్రీరామ్ బర్త్ డే సందర్భంగా షేర్ చేసిన వీడియో నెట్టింట నవ్వులు పూయిస్తోంది. ఇంతకీ అదేంటో మీరు కూడా చూసేయండి.

డైరెక్టర్ వేణు శ్రీరామ్ పుట్టినరోజు కానుకగా తమ్ముడు మూవీ రిలీజ్ డేట్‌ను మేకర్స్ రివీల్ చేశారు. అయితే ఈ విషయాన్ని ఓ వీడియో రూపంలో వెల్లడించారు. దర్శకుడు వేణు శ్రీరామ్ దగ్గరికి వచ్చిన హీరోయిన్లు బర్త్ డే విషెస్‌కు బదులుగా మూవీ రిలీజ్ డేట్ ఎప్పుడు సార్?అని అడుగుతారు. దీంతో ఆయన కాస్తా షాకింగ్‌కు గురవుతారు. హీరోయిన్లు సప్తమీ గౌడ, వర్ష బొల్లమ్మతో పాటు మరో సీనియర్ టాలీవుడ్ హీరోయిన్ లయ కూడా దర్శకుడితో మూవీ విడుదల తేదీ గురించే ఆరా తీస్తుంది.

అసలే నేను తెలుగమ్మాయిని.. 20 ఏళ్ల తర్వాత రీ ఎంట్రీ ఇస్తున్నా.. నేను ఈ సినిమాలో ఉన్నానా సార్? అంటూ డైరెక్టర్ వేణు శ్రీరామ్‌ను ప్రశ్నిస్తుంది. 'ఒక్క పోస్టర్ లేదు.. అప్‌డేట్ లేదు.. కనీసం సినిమా రిలీజ్ డేట్ అయినా చెప్పండి.. వెళ్లి థియేటర్లోనే చూసుకుంటా' అని లయ మాట్లాడింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది చూసిన టాలీవుడ్ ఫ్యాన్స్ మూవీ ప్రమోషన్లలో ఇదొక డిఫరెంట్ వే అంటూ కామెంట్స్ పెడుతున్నారు.

కాగా.. వేణు శ్రీరామ్ నితిన్ కాంబోలో వస్తోన్న తమ్ముడు మూవీ జూలై 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర బ్యానర్‌లో దిల్‌రాజు, అల్లు శిరీష్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన రాబిన్ హుడ్ మూవీ హిట్ కాకపోవడంతో నితిన్ ఫ్యాన్స్ తమ్ముడిపై ఆశలు భారీగానే పెట్టుకున్నారు. మరీ వారి అంచనాలకు తగినట్లుగా రాణిస్తుందో లేదో తెలియాలంటే జూలై 4వరకు వేచి చూడాల్సిందే.





## కలిసి నటించారు.. ఇప్పుడేమో పెళ్లి రూమర్స్

మృణాల్ ఠాకుర్.. ఈ పేరు చెప్పగానే 'సీతారామం', 'హాయ్ నాన్న' సినిమాలే గుర్తొస్తాయి. చేసింది కొన్ని చిత్రాలే అయినా తెలుగులో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ప్రస్తుతానికైతే హిందీలో బిజీగా ఉంది. అలాంటిది ఇప్పుడు ఈమె ఓ తెలుగు హీరోతో ప్రేమలో ఉందని అంటున్నారు. ఇంతకీ నిజమేంటి?

మృణాల్ తొలి తెలుగు సినిమా 'సీతారామం'లో అక్కినేని హీరో సుమంత్ కూడా నెగిటివ్ టచ్ ఉన్న పాత్ర చేశాడు. మరి ఈ మూవీ తర్వాత వీళ్లిద్దరి పరిచయం కాస్త ప్రేమ వరకు వెళ్లిందని అంటున్నారు. అందుకు తగ్గట్లే గత రెండు మూడు రోజుల నుంచి సోషల్ మీడియాలో పుకార్లు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఇద్దరు కలిసి ఫొటో కూడా ఒకటి వైరల్ అవుతుంది.

మరి అంతటా వినిపిస్తున్నట్లు నిజంగా మృణాల్, సుమంత ప్రేమలో ఉన్నారా అంటే చెప్పడం కష్టం. ఎందుకంటే ఒక్క ఫొటోలో కాస్త చనువుగా ఉన్నంత మాత్రాన అదే ప్రేమ అని చెప్పలేం. మరోవైపు కెరీర్ పరంగా బిజీ ఉన్న మృణాల్.. ఇప్పుడు పెళ్లి చేసుకుంటుందా అనేది సందేహమే. కాబట్టి ఇవన్నీ ఒట్టి పుకార్లు మాత్రమే అనిపిస్తుంది.

గతంలో సుమంత్.. హీరోయిన్ కీర్తిరెడ్డిని పెళ్లి చేసుకున్నాడు. కానీ రెండేళ్లకే వీళ్లిద్దరూ విడిపోయారు. అప్పటినుంచి సుమంత్ సింగిల్ గానే ఉంటున్నారు. ప్రస్తుతం అప్పడప్పుడు ఒకటి అరా సినిమాలు చేస్తున్నాడు. అయితే మృణాల్ ఠాకుర్ తో ప్రేమ, పెళ్లి అంటూ వస్తున్న పుకార్లకు ఇతడి నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి?

# రియాన్ పరాగ్ పోరాటం వృథా..
# ఒక్క పరుగు తేడాతో కోల్‌కతా విజయం

**ఐపీఎల్ 18 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఐదో విజయం సాధించింది. సొంతగడ్డపై రాజస్థాన్ రాయల్‌స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క పరుగు తేడాతో గెలిచింది.**





**కోల్‌కతా:** ఐపీఎల్ 18 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఐదో విజయం సాధించింది. సొంతగడ్డపై రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క పరుగు తేడాతో గెలిచింది. తొలుత కోల్‌కతా నిర్ణీత 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఆండ్రీ రస్సెల్ (57*; 25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. లక్ష్యఛేదనలో రాజస్థాన్ 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (95; 45 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లు) పోరాటం వృథా అయింది. యశస్వి జైస్వాల్ (34; 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), హెట్‌మయర్ (29; 23 బంతుల్లో) రాణించారు. వైభవ్ సూర్యవంశీ (4), కునాల్ సింగ్ రాథోడ్ (0), ధ్రువ్ జురెల్ (0), వానిందు హసరంగ (0) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. చివర్లో శుభమ్ దూబె (25*; 14 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), జోఫ్రా ఆర్చర్ (12; 8 బంతుల్లో) పోరాడినా రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు.

లక్ష్యఛేదనలో రాజస్థాన్ ఎనిమిది పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. తొలి రెండు ఓవర్లలోనే వైభవ్ సూర్యవంశీ, కునాల్ సింగ్ వెనుదిరిగారు. ఈ క్రమంలో యశస్వి, పరాగ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. అరోరా వేసిన మూడో ఓవర్‌లో చెరో సిక్స్ బాదారు. హర్షిత్ వేసిన తర్వాతి ఓవర్‌లో పరాగ్ రెండు ఫోర్లు, ఓ సిక్స్ రాబట్టాడు. జైస్వాల్‌కు చకచకా బౌండరీలు బాదడంతో పవర్ ప్లే ముగిసేసరికి రాజస్థాన్ 59/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే, మొయిన్ అలీ వేసిన తర్వాత ఓవర్‌లో జైస్వాల్.. రింకు సింగ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అనంతరం వరుణ్ ఒకే ఓవర్‌లో జురెల్, హసరంగను ఔట్ చేశాడు. దీంతో కొన్ని ఓవర్లపాటు స్కోరు వేగం నెమ్మదించింది. ఈ క్రమంలో పరాగ్ ఒక్కసారిగా గేర్ మార్చాడు. మొయిన్ అలీ వేసిన 13 ఓవర్‌లో పరాగ్ ఏకంగా ఐదు సిక్స్‌లు బాదేసి రాజస్థాన్‌ను పోటీలోకి తెచ్చాడు. అయితే, హర్షిత్ తన వరుస ఓవర్లలో హెట్‌మయర్, పరాగ్‌ను ఔట్ చేయడంతో కోల్‌కతా రేసులోకి వచ్చింది. అప్పటికి రాజస్థాన్ స్కోరు 18 ఓవర్లకు 174/7.

**ఆఖర్లో ఉత్కంఠ**

రస్సెల్ 19 ఓవర్ వేసి 11 పరుగులు ఇచ్చాడు. ఆఖరి ఓవర్ (వైభవ్ అరోరా బౌలర్)లో రాజస్థాన్ గెలవాలంటే 22 పరుగులు అవసరం కాగా.. తొలి రెండు బంతుల్లో మూడు పరుగులు వచ్చాయి. తర్వాత శుభమ్ దూబె వరుసగా 6, 4, 6 బాదేశాడు. చివరి బంతికి విజయ సమీకరణం మూడు పరుగులు కాగా.. ఒకే రన్ వచ్చింది. రెండో పరుగు పూర్తిచేసే క్రమంలో ఆర్చర్ రనౌటయ్యాడు. దీంతో కోల్‌కతా ఒక్క పరుగు తేడాతో గట్టెక్కింది.

**రస్సెల్ మెరుపులు**

తొలుత కోల్‌కతా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. ఆండ్రీ రస్సెల్ మెరుపు అర్ధ శతకం బాదాడు. అంగ్‌క్రిష్ రఘువంశీ (44; 31 5 ఫోర్లు), రెహ్మానుల్లా గుర్బాజ్ (35; 25 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌లు), అజింక్య రహానె (30; 24 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. చివర్లో రింకు సింగ్ (19*; 6 బంతుల్లో) దూకుడుగా ఆడాడు. 14 ఓవర్లకు కోల్‌కతా 111/3తో నిలిచిన కోల్‌కతా రస్సెల్ మెరుపులతో 200కుపైగా స్కోరు చేసింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన రస్సెల్.. క్రమంగా దూకుడు పెంచాడు. ఆకాశ్ మధ్వాల్ బౌలింగ్‌లో వరుసగా 4, 6, 4 బాదేశాడు. ఆర్చర్ వేసిన తర్వాతి ఓవర్‌లో సిక్స్, ఫోర్ రాబట్టాడు. తీక్షణ వేసిన 18 ఓవర్‌లో రస్సెల్ హ్యాట్రిక్ సిక్స్‌లు కొట్టి అర్ధ శతకానికి చేరువయ్యాడు. 18.1 ఓవర్‌కు రఘువంశీని ఆర్చర్ వెనక్కి పంపగా.. అదే ఓవర్‌లో రస్సెల్ సిక్స్ బాది ఈ సీజన్‌లో తొలి హాఫ్ సెంచరీ అందుకున్నాడు. ఆకాశ్ వేసిన చివరి ఓవర్‌లో రింకు వరుసగా 4, 6, 6 బాదేశాడు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, యుధ్వీర్ సింగ్, మహీశ్ తీక్షణ, రియాన్ పరాగ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## ముక్కోణపు సిరీస్‌లో భారత్‌కు తొలి ఓటమి



**శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు తొలి ఓటమి చవిచూసింది.**

**కొలంబో:** శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు తొలి ఓటమి చవిచూసింది. టీమ్ఇండియాపై శ్రీలంక 3 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని శ్రీలంక.. ఐదు బంతులు మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లంక బ్యాటర్లలో నీలాక్షి డి సిల్వా (56), హర్షిత సమరవిక్రమ (53) అర్ధ శతకాలు బాదారు. టీమ్ఇండియా బ్యాటర్లలో రిచా ఘోష్ (58; 48 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిసింది. ప్రతీకా రావల్ (35), జెమీమా రోడ్రిగ్స్ (37), హర్మన్‌ప్రీత్ కౌర్ (30), హర్లీన్ డియోల్ (29), దీప్తి శర్మ (24) పరుగులు చేశారు.

## లఖ్‌నవూ హ్యాట్రిక్ ఓటమి..
## పంజాబ్‌కు ఏడో విజయం



**లఖ్‌నవూ సూపర్ జెయింట్‌స్‌ను పంజాబ్ కింగ్స్ 37 పరుగుల తేడాతో ఓడించింది.**

**ధర్మశాల:** ఐపీఎల్ 18 లో పంజాబ్ కింగ్స్ ఏడో విజయం సాధించింది. ధర్మశాల వేదికగా జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై ఆ జట్టు 37 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత ప్రభ్‌సిమ్రన్ సింగ్ (91; 48 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) దంచికొట్టడంతో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 199 పరుగులకు పరిమితం అయింది. ఆయుష్ బదోనీ (74; 40 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (45: 24 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) పోరాడినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.

మిచెల్ మార్ష్ డకౌట్ కాగా.. మార్‌క్రమ్ (13), నికోలస్ పూరన్ (6), రిషభ్ పంత్ (18), డేవిడ్ మిల్లర్ (11) పరుగులు చేశారు. అర్‌ష్‌దీప్ సింగ్ (3/16) ఆరంభంలో వరుసగా మూడు వికెట్లు పడగొట్టి లఖ్‌నవూకు గట్టి షాక్ ఇచ్చాడు. ఒమర్జాయ్ 2, చాహల్, యాన్సెన్ ఒక్కో వికెట్ తీశారు. ఈ విజయంతో పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు మరింత చేరువైంది. ఆ జట్టు ఇప్పటివరకు 11 మ్యాచ్‌లో 7 విజయాలు సాధించింది. ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దు అయింది. ప్రస్తుతం పంజాబ్ ఖాతాలో 15 పాయింట్లు ఉన్నాయి. లఖ్‌నవూకు 11 మ్యాచ్‌ల్లో ఇది **ఆరో ఓటమి.**

తొలుత ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తోపాటు మిగతా బ్యాటర్లు చెలరేగడంతో పంజాబ్ భారీ స్కోరు చేసింది. శ్రేయస్ అయ్యర్ (45; 25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోష్ ఇంగ్లిస్ (30; 14 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (33*; 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), స్టాయినిస్ (15; 5 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), నేహల్ వధేరా (16*; 9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీలతో విరుచుకుపడ్డారు. లఖ్‌నవూ బౌలర్లలో ఆకాశ్ మహారాజ్ సింగ్ 2, దిగ్వేశ్ సింగ్ రాఠీ 2, ప్రిన్స్ యాదవ్ ఒక వికెట్ పడగొట్టారు.

## అసలైన ఛాంపియన్..: విరాట్ స్ట్రైక్‌రేట్‌పై ఇర్ఫాన్ పఠాన్



విరాట్ కోహ్లీ ఆటతీరుపై ఎన్ని విమర్శలు వచ్చినా.. తన జట్టు విజయాల్లో మాత్రం కీలక పాత్ర పోషిస్తున్నాడు. అతడి స్ట్రైక్‌రేట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిపోయింది.

ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టాప్‌లోకి దూసుకెళ్లింది. 11 మ్యాచుల్లో ఎనిమిది విజయాలు సాధించిన ఆర్సీబీ దాదాపు నాకౌట్ దశకు చేరుకున్నట్లే. ప్రస్తుతం 505 పరుగులు చేసిన కోహ్లీ ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు. అతడి స్ట్రైక్‌రేట్‌పై చాలా విమర్శలు వస్తున్నాయి. కోహ్లీ ఆటతీరు టీ20లకు పనికిరాదనే వ్యాఖ్యలూ వచ్చాయి. అయితే, వాటిని భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కొట్టిపడేశాడు. సీఎస్కేపై కోహ్లీ కేవలం 33 బంతుల్లోనే 62 పరుగులు చేశాడు. "ఇప్పటి వరకు ప్రతి మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ యాంకర్ పాత్ర పోషించాడు. అంతకుముందు వరకు కనీసం 100 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు రాబట్టాడు. అతడు దూకుడుగా ఆడాలంటే ఆడేస్తాడు. సీఎస్కేపై 187 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేశాడు. తెల్ల బంతి క్రికెట్‌లో అతడు నిజమైన ఛాంపియన్. దూకుడుగా ఎలా ఆడాలో తెలుసు. నిలకడగా ఏ విధంగా పరుగులు రాబట్టాలో కోహ్లీకి బాగా తెలుసు" అని ఇర్ఫాన్ పోస్టు పెట్టాడు.

## మ్యాక్సీ ఔట్.. 'బిగ్‌బాష్' టాప్ స్కోరర్‌తో
# పంజాబ్ రిప్లేస్‌మెంట్



పంజాబ్ కింగ్స్ ఇవాళ లఖ్‌నవూతో తలపడనుంది. ప్లేఆఫ్స్ రేసులో దూసుకుపోవాలంటే ప్రతి మ్యాచ్ విజయమూ ఆ జట్టుకు కీలకం. ఈ క్రమంలో తన జట్టులోకి ఓ ఆల్‌రౌండర్‌ను తీసుకుంది.

ఐపీఎల్ 2025 సీజన్ నుంచి పంజాబ్ కింగ్స్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ వైదొలిగాడు. గాయం కారణంగా దూరమైన మ్యాక్సీ స్థానంలో ఆస్ట్రేలియా ఆటగాడు మిచెల్ ఓవెన్‌ను పంజాబ్ తీసుకుంది. రూ.3 కోట్లతో ఆ జట్టుతో జాయిన్ కాబోతున్నాడు. 202425 సీజన్‌లో బిగ్‌బాష్ లీగ్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హోబర్ట్ హరికేన్స్ తొలిసారి విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. 200 స్ట్రైక్‌రేట్‌తో 452 పరుగులు చేశాడు.

ప్రస్తుతం మిచెల్ పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో పెషావర్ జాల్మీ జట్టుకు ఆడుతున్నాడు. బాబర్ అజామ్ కూడా ఇదే టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మిచెల్ ఎంపికపై ఐపీఎల్ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. ‘‘పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ మిచెల్ ఓవెన్‌ను తీసుకుంది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ స్థానంలో అతడిని ఎంపిక చేసింది. వేలికి గాయం కావడంతో ఐపీఎల్‌లో మిగతా మ్యాచులకు మ్యాక్సీ దూరం కానున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ ఓవెన్ 34 టీ20లు ఆడి 646 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. పది వికెట్లూ తీశాడు’’ అని వెల్లడించింది.